రోడ్లతోనే తిరుపతి అభివృద్ధి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా : రోడ్ల అభివృద్ధితో రాబోవు రోజుల్లో కొత్త తిరుపతి ఆవిష్కృతం అవుతుందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తిమ్మనాయుడుపాలెం- అన్నమయ్య మార్గాలను కలుపుతూ చేపట్టిన 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రోడ్లు ఉంటేనే నగరం విస్తరిస్తుందన్నారు. తిరుపతి నగరానికి రోడ్లు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. అందువల్లే నగరం కొంత ప్రాంతంలోనే ఆగిపోయిందన్నారు. బస్టాండ్‌కు కూత వేటు దూరంలో ఉన్న నగర తూర్పు ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని, ఇప్పటికే 10కి పైగా రోడ్లను పూర్తిచేసి నగరవాసులకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మిగిలిన 8 రోడ్లను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నగర మౌలిక వసతుల కోసం వందలాది కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. నూతనంగా నిర్మించిన రహదారుల ప్రాంతంలో నిర్మాణాలు ఊపందుకున్నాయని, మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు పెరుగుతున్నాయని తెలిపారు. డీఈ విజయ్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్ శేఖర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు

తిరుపతి మంగళం : తిరుపతి జీవకోన రోడ్డులోని సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డును కలుపుతూ చేపట్టిన రోడ్డ విస్తరణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో భవన నిర్మాణాలు, వివిధ పనుల కోసం జీవకోన, రాజీవ్‌గాంధీకాలనీ ప్రాంతాల నుంచి వేలాది మంది కార్మికులు, స్థానికులు వెళుతుంటారని తెలిపారు. వారికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్డు విస్తరణ పనులను చేపట్టినట్టు తెలిపారు. ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే జీవకోన ప్రజలు నగరంలోకి వెళ్లి వచ్చేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఇప్పటికే నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్డు విస్తరణతో ట్రాఫిక్‌కు చెక్ పెట్టామన్నారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు కోటేశ్వరమ్మ, డాక్టర్ అనీష్‌రాయల్, సేవాదళ్ రీజనల్ కో-ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, పార్టీ నాయకులు మధుసూదన్‌నాయుడు, సుబ్రమణ్యం, దుర్గ, భారతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర పడ్నవీస్, సినీ డైరెక్టర్ లోకేష్ కనకరాజు దర్శించుకున్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ సతీమణి తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఎస్.సూర్య

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని సుధహా పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.సూర్య రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్-14 జిల్లా స్థాయి కరాటే పోటీల్లో 60 కేజీల విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు జాకబ్



తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టులో తిరుపతి నగరానికి చెందిన కె.జాకబ్ హెరాల్డ్ హర్షిత్ స్థానం పొందాడు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో జాకబ్ ప్రతిభ చూపాడు. అతను ఎస్వీసీఈ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో శుక్రవారం నుంచి నిర్వహించనున్న జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (సంతోష్ ట్రోఫి) పోటీల్లో జాకబ్ పాల్గొననున్నాడు. అతన్ని కళాశాల యాజమాన్యం, కోచ్‌లు వెంకటరాములు, రాజు, వినోద్, డైనమోస్ ఫుట్‌బాల్ క్లబ్, జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు అభినందించారు.

కాంస్య పతకం సాధించిన వంశీకి సత్కారం



వంశీని సత్కరిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

తిరుపతి సిటీ : ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా తల్‌సైనిక్ శిబిరం ఫైరింగ్ విభాగంలో ఆంధ్ర, తెలంగాణా ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వంశీ కాంస్య పతకం సాధించడం గర్వంగా ఉందని ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ కమాండర్ కల్నల్ అజయ్‌బసనెట్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌సీసీ కార్యాలయంలో గురువారం పతకం సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్ వంశీని సన్మానించారు. ఎన్‌సీసీ అధికారులు రమేష్, చైత్రి, మహేష్, గణేష్ పాల్గొన్నారు.

సంస్కారాన్ని నేర్పే దేవాలయం కళాశాల

తిరుపతి సిటీ : పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని నేర్పే దేవాలయం కళాశాల అని టీటీడీ విజిలెన్స్ ఆఫీసర్ డీఎస్పీ శివానంద కిషోర్ తెలిపారు. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం 2023 - 2024లో అడ్మిషన్లు పొందిన విద్యార్థినులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అంకిత భావాన్ని కలిగి ఉంటే దేనినైనా సాధించవచ్చని తెలిపారు. టీటీడీ డీఈవో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు అవగాహన లోపంతో కొన్ని ప్రలోభాలకు లోనవుతున్నారని, వాటిని విడనాడి విద్యపై శ్రద్ధ పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ మహాదేవమ్మ మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు విభాగాధిపతి డీఎం ప్రేమావతి, నారాయణ, దామోదరం, అంజూయాదవ్, ఎస్ఐ అరుణ, స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జ్ భువనేశ్వరి దేవి, భద్రమణి, వార్డెన్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని లగేజీ వ్యాను బోల్తా



చంద్రగిరి: డివైడర్‌ను ఢీకొని లగేజీ వ్యాను బోల్తా పడిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి కోదండరామాపురం వద్ద గురువారం తెల్లవారిజామున చోటు చేసుకుంది. లగేజీ వ్యాను మొక్కజొన్న కంకెల లోడుతో చిత్తూరు నుంచి తిరుపతికి బయలుదేరింది. కోదండరామాపురం వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. డ్రైవరు, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని తిరుపతి రుయాకు తరలించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొఫెసర్ జాన్‌సుష్మకు అంతర్జాతీయ పరిశోధన ప్రాజెక్టు



జాన్‌సుష్మను అభినందిస్తున్న రిజిస్ట్రార్ రజని, వీసీ భారతి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళ వర్సిటీ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జాన్ సుష్మకు ఎక్లిప్టా ప్రొస్టాటా ఆధారిత మెగ్నీషియం ఆక్సైడ్ నానో పార్టికల్ యాంటీ బయోబెటిక్, స్ట్రెప్టోజోటోసిన్- ప్రేరిత డయాబెటిస్ అనే అంశంపై ఎలుకలు, వాటి పనితీరు సంబంధించి అంతర్జాతీయ పరిశోధన ప్రాజెక్టు మంజూరైంది. ఈ ప్రాజెక్టు ప్రపంచ స్థాయిలో మధుమేహంపై పరిశోధన, చికిత్స వంటి విషయాలపై పరిశోధన చేసేందుకు తోడ్పడుతుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు లీడర్ మన్సూరు ఇస్మాయిల్, ప్రొఫెసర్ జాన్‌సుష్మను వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు అభినందించారు.

దూడల ప్రదర్శన



పాడి రైతులకు బహుమతులుప్రదానం చేస్తున్న ఎంపీపీ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానికురవపల్లెలో గురువారం పశు సంతతి పథకం ద్వారా పుట్టిన దూడలు ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ పశు సంతతి పథకం కింద పాడి రైతులకు మంచి పాలిచ్చే ఆవులతో పాటు, వెన్న శాతం, పాల దిగుబడి కలిగిన ఆవులు అందజేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాను ఈ పథకం కింద ఎంపిక చేసి పాడి సంతతి అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రదర్శనకు వచ్చిన 58 దూడల్లో దృఢంగా ఉన్న వాటిని ఎంపిక చేసి రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాల విమల, డీఎల్‌డీఏ ఈవో బాలసుబ్రమణ్యం, తిరుపతి పశుసంర్థక శాఖ డీడీ ఉమామహేశ్వరి, పీటీపీ డీడీ వాసు, పీటీపీ ఏడీ ఆశిష్, ఏడీఏ రమణకుమార్, మండల పశు వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.



దూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న వైద్య బృందం

కాలువ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం : తిరుపతి కేశవాయనగుంట ప్రాంతంలో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణ పనులను గురువారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతి నగర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. కేశవాయనగుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగతిన పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న వ్యవసాయ చిత్రం



మోహన్ కృష్ణ కేతారి

తిరుపతి కల్చరల్ : సాక్షి తిరుపతి సీనియర్ ఫొటోగ్రాఫర్ కేతారి మోహనకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. విజయవాడ ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ త్రైమాసిక ఫొటోగ్రఫీ పోటీలో ఏరువాక వ్యవసాయం, నీరు విభాగంలో ఈ నెల 15న రాష్ట్ర స్థాయి ఫొటో కాంపిటీషన్ నిర్వహించింది. ఇందులో మోహన్ కృష్ణ కేతారి తీసిన వ్యవసాయ చిత్రం ఎంపికైంది. అకాడమీ ప్రతినిధులు గురువారం విజేతల జాబితాను విడుదల చేశారు. వచ్చే నెలలో విజయవాడలో అవార్డు అందజేయనున్నారు.

ఐఏఎల్ న్యాయవాదుల ధర్నా



తిరుపతి లీగల్ : రాష్ట్ర బార్ కౌన్సిల్ నూతనంగా తీసుకువచ్చిన రూ.20ల న్యాయవాదుల సంక్షేమ స్టాంపును నిరసిస్తూ తిరుపతి ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) న్యాయవాదులు గురువారం ధర్నా చేశారు. ఐఏఎల్ రాయలసీమ జోన్ కన్వీనర్ న్యాయవాది లక్ష్మన్న మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధి చట్ట సవరణను రాష్ట్ర బార్ కౌన్సిల్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో న్యాయవాదులకు ఇచ్చిన రుణాలను మాఫీ చేయాలని కోరారు. మరణించిన న్యాయవాదులకు రూ.4 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విడిపోయిన సందర్భంలో రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు వచ్చిన సొమ్ముపై దర్యాప్తు చేయాలన్నారు. న్యాయవాదులు రమేష్, వెంకటేష్, అజయ్ కుమార్, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. నగరంలోని 8, 43 వార్డులకు సంబంధించి జర్నలిస్ట్ కాలనీలోని సచివాలయం ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వలంటీర్, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు ప్రతి ఇంటికి వచ్చి సర్వే చేస్తారని, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వారికి టోకెన్ ఇచ్చి, ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకువస్తున్నట్టు చెప్పారు. ప్రజలు నేరుగా వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చని కోరారు. గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు వెయ్యి మంది పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రెటరీ రాధిక, సూపరింటెండెంట్ రవి, వైద్యులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



చంద్రగిరి: స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

చంద్రగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందజేస్తున్నట్టు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. గంగుడుపల్లిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో రమేష్‌బాబు క్యాంపును పరిశీలించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ వైద్య పరీక్షల అనంతరం రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుభాషిణి, నాగమణి పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టుతో సీమకు అన్యాయం

తిరుపతి కల్చరల్: కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని జాతీయ రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచెం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆయన గురువారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5.300 కోట్లు కేటాయించిదని తెలిపారు. ఇప్పటికే తుంగభద్ర జలాశయానికి సరిపడా నీరు రాకపోవడంతో రాయలసీమ జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాజా అప్పర్ భద్ర ప్రాజెక్టుతో మూడు ఉమ్మడి జిల్లాలలోని 7.94 లక్షల ఎకరాలకు సాగు నీరు అందదని, హంద్రీ నీవా, పోతిరెడ్డిపాడు, ఎస్ఆర్‌బీసీ, తెలుగు గంగపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అప్పర్ భద్రను వ్యతిరేకిస్తూ మన రాష్ట్రం త్వరలోనే సుప్రీం కోర్టు ఒరిజినల్ సూట్ దాఖలు చేయడానికి కసరత్తు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తరతరాలుగా రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని చాటి చెప్పే దిశగా నవంబర్ 27న తిరుపతిలోని ఆటోనగర్ ప్రాంతంలో రాయలసీమ పొలికేక చేపడుతున్నట్లు తెలిపారు.

ఒక శాతం నిధుల కేటాయింపు హర్షణీయం



మాట్లాడుతున్న టీటీడీ ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్ వెంకటేశం

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధికి ఒక శాతం నిధులు కేటాయిస్తూ టీటీడీ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీటీడీ ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్లు వెంకటేశం, ప్రసాద్‌రావు, వెంకటరమణారెడ్డి తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీటీడీ తిరుపతిలో పలు సంస్థలను నిర్వహిస్తోందన్నారు. అంతేగాక టీటీడీలో పనిచేసే 30 వేల కుటుంబాల వారు, సుమారు లక్ష మంది తిరుపతిలో నివాసముంటున్నారని తెలిపారు. శ్రీవారి భక్తులు తిరుపతి నుంచినే తిరుమల వెళ్లాల్సి ఉందన్నారు. వెంకటేశ్వరస్వామి లేకుండా తిరుపతిని ఊహించలేమన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నగరంలో పారిశుద్ధ్య కోసం ఒక శాతం నిధులు కేటాయిస్తూ టీటీడీ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామన్నారు. ఈ నిర్ణయాన్ని బీజేపీ నేతలు వ్యతిరేకించడం సమంజం కాదన్నారు. రాజకీయాలకు అతీతంగా స్వాగతించాలని కోరారు. టీటీడీ ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్లు ఇందిర, జే.భాస్కర్, రామచంద్రయ్య, బీసీ ఉద్యోగ సంఘాల కన్వీనర్ రాజ్‌కుమార్, మునికష్ణ, పద్మనాభం, రవికుమార్, నరేష్, ఆదిలక్ష్మి, కల్పన పాల్గొన్నారు.

14 నుంచి వేదాంత దేశికర్ సాలకట్ల ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయ అనుబంధ వేదాంత దేశికర్ ఆలయంలో ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల ఉత్సవం నిర్వహించనున్నారు. వెంకటేశ్వరస్వామి ఘంటా స్వరూపుడు వేదాంత దేశికర్ జయంతిని పురస్కరించుకుని ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల చివరి రోజైన ఈ నెల 23వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారిని వేదాంత దేశికర్ ఆలయానికి వేంచేపు చేస్తారు. అక్కడ శాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి అప్పా పడిని ఊరేగింపుగా తెచ్చి వేదాంత దేశికర్‌కు సమర్పిస్తారు. ఈ ఉత్సవం కారణంగా గోవిందరాజస్వామి ఆలయంలో ఊంజల్ సేవను టీటీడీ రద్దు చేసింది. శ్రీవారు జన్మించిన భాద్రపద మాసం శ్రవణ నక్షత్రంలోనే వేదాంత దేశికర్ సుమారు 750 ఏళ్ల క్రితం కాంచీపురంలోని తూప్పుల్ అగ్రహారంలో జన్మించారు. ఈయన స్వామి వారిని కీర్తిస్తూ దయా శతకం అనే స్తోత్రం రచించారు. శ్రీవారి సుప్రభాతం రచించిన శ్రీప్రతివాద భయంకర అణ్ణన్‌కు శ్రీవేదాంత దేశికర్ గురువర్యులు.



వెలుగు పూలు

తిరుపతి నగరంలో నిర్మించిన శ్రీనివాస సేతు వంతెనపై ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు రాత్రిళ్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నల్లటి మబ్బుల్లో వెలుగు పూలు పూసినట్టు కనువిందు చేస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో తిరుమల వెళ్లే భక్తులు వంతెనపై నిలిచి సెల్ఫీలు తీసుకుని మురిసిపోతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

గార్లపాటి సాహితీ పురస్కారాలు ప్రదానం



ఆచార్య సర్వోత్తమరావును సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన పలువురు కవులు, రచయితలను పురస్కారాలతో సత్కరించి ప్రోత్సహించడం గొప్ప విషయమని స్విమ్స్ వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్‌వీ.కుమార్ తెలిపారు. విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం గార్లపాటి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం గురువారం రాస్ భవన్‌లో నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా ప్రవీణుడు, సాహితీ అభిలాషి గార్లపాటి దామోదరం ప్రతి ఏటా ఐదుగురు సాహితీవేత్తలకు సాహితీ పురస్కారాలు, ఇద్దరు రైతులకు ఏనుగు అంకమనాయుడు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రైతు పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్య గల్లా చలపతి జ్ఞాపకార్థం కంపల్లె రవిచంద్రన్, ఆచార్య కోసూరి దామోదర నాయుడు సంయుక్తంగా ఆచార్య సర్వోత్తమరావు, ఆచార్య జక్కంపూడి మునిరత్నంకి పురస్కారాలు అందజేసి సత్కరించారు. అలాగే గార్లపాటి దామోదర నాయుడు తాత, తల్లి, తండ్రి పేరిట డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి, ఎంఆర్.అరుణకుమారిని సాహితీ పురస్కారాలతో సత్కరించారు. ఏనుగు అంకమనాయుడు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పసల హరికృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డికి రైతు పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం ఆచార్య సర్వోత్తమరావు రాసిన విభూతి యోగం, డాక్టర్ చిన్నాపుల వెంకట రాజారెడ్డి రాసిన వేంకటేశ్వర ద్విశతి పుస్తకాలను ఆవిష్కరించారు. ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖాధిపతి రాజేశ్వరమ్మ పురస్కార గ్రహీతలందరికీ అధ్యయన శాఖ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, భారతీయ విద్యాభవన్ సత్యనారాయణ, విశ్వశ్రీ సాహితీ సామాఖ్య ప్రతినిధులు ఆకుల మల్లేశ్వరరావు, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, సాహితీ కురవృద్ధులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, విశ్రాంత ఆచార్యులు దామోదర నాయుడు, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

